# పారిస్

## బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

**జన్మస్థలం కాకినాడ. రెండవ తరం కథకులలో అతికొద్ది కథలతో మంచి పేరు తెచ్చుకున్న కథకులు. లాయరుగా జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అడ్వకేట్ జనరల్ పదవిని అలంకరించారు. తెలుగువారు సగర్వంగా చెప్పకునే త్రివేణి ఆంగ్ల పత్రికకు సంపాదకులుగా కొంతకాలం పనిచేశారు. వీరి 'జేబురుమాలు' కథ యిప్పటికీ కథా ప్రియులకు జ్ఞాపకమే. ఆ పేరుతోనే వీరి కథా సంకలనం వెలువడింది. ఇరవై ఏళ్ల క్రితం వీరు కీర్తిశేషులైనారు. కథల్లో కథనంలో వీరిదొక ప్రత్యేక బాణి.**

ఎవరికైనా నేను ఉద్ధిపోరపాటున పాశ్చాత్య దేశాలు కొన్ని చూసి తిరిగి వచ్చానని తెలిస్తే వాళ్ళు నన్ను ముందు అడిగే ప్రశ్న 'పారిస్ చూసేరా?' అని. అంతదూరం వెళ్లి పారిస్ నగరాన్ని చూడకుండా రావడమా? ఈ అడిగేవాళ్ళలో కొందరు పారిస్ చూడకపోయినా, దాని గురించి చదివియుండడం వల్ల 'నాతిర్‌దాం ఆలయం చూసేరా?' అనీ, 'లూవ్రే చిత్రశాల చూసేరా?' అని, 'వర్సేయ్ రాజభవనం చూసేరా?' అని; 'ఈఫెల్ టవర్ చూసేరా' అని అడుగుతూ ఉంటారు. అన్నీ చూసేనని సమాధానం చెప్తూ ఉంటాను. మరికొందరు ఏవిధంగానో పారిస్ నగరంలో జరిగే పెంకితనాలు కొంత వివరంగా తెలుసుకున్న వాళ్ళు 'ఫొలీస్ బర్జేర్ నాటకశాలకి ఎప్పుడైనా వెళ్లేరా?' అని సందేహిస్తూ అడుగుతారు. వాళ్ల కుతూహలం గ్రహించి నవ్వుతూ 'వెళ్లే'నని జవాబిస్తాను. కాని పారిస్ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఇవేవీ నాకు జ్ఞాపకం రావు. అందుకు మొదటి కారణం పారిస్ నగరాన్నీ, ఆ నగరం యొక్క దృశ్యాలనీ నేను ఒక్కమాటు కాకుండా అనేకమాట్లు చూసేను. నాకెందు వల్లనో కాని ఒక్క మాటు చూసినవి మాత్రమే చటుక్కున జ్ఞాపకం వస్తాయి. అనేకమాట్లు చూసినవి అలవాటు వల్ల వెనకకిపడి, ప్రత్యేకంగా ఆలోచిస్తేకాని మనస్సుకి మళ్లీ చిక్కవు కాబోలు. రెండవ కారణం నేను పారిస్ నగరాన్నే కాకుండా అనేక గొప్ప పాశ్చాత్య నగరాలు చూసేను. బర్లిన్, వీన్, రోమ్, నపోలీ, మ్యీన్‌చెన్, ఫిరన్‌జె, బుడాపెస్ట్, జినీవా, లుసర్న్, లెనిన్‌గ్రాడ్, మాస్కో.. ఇంకా ఎన్నో నగరాలు. అక్కడా అక్కడా చూడవలసిన విచిత్రాలూ అన్నీ చూసేను. అందువల్ల పారిస్ విశేషాలేవీ అంత ప్రత్యేకంగా వాటంతటవి జ్ఞాపకంరావు. ఈ రెండు కారణాలేకాక మరొక కారణం వీటి రెండిటికంటే ముఖ్యమైనది, రెనీ.

పారిస్ నగరాన్ని నేనెప్పుడు తలచుకొన్నా రెనీ ఒక్కత్తే నాకు జ్ఞాపకం వస్తుంది. రెనీ ఒక ఫ్రెంచి పిల్ల. పారిస్‌లోనే పుట్టి పారిస్‌లోనే పెరిగింది. పూర్తి పేరు రెనీబర్నే. అంత మరీ అందమైనదని నేను చెప్పను. ఇంగ్లండులో కనబడే అందమైన ముఖాలూ, అందమైన శరీరాలూ మన దేశంలోనూ నాకు కనబడ లేదు. ఈ విషయంలో పారిస్ నాకసలే నచ్చలేదు. పారిస్‌లో ముఖాలన్నీ అనేక రాత్రుల్లబట్టి నిద్రలేనివాళ్ళ ముఖాలలా ఉంటాయి. అదే కాక 'లాటిన్' ప్రజ కనుక వాళ్ళ యవ్వనపు కళలూ, శోభా త్వరలో మాయమై

## ఆణిముత్యాలు

పోతాయనుకుంటాను కూడా. అదెల్లా ఉన్నా రెనీ అంత అందమైనదని చెప్పేందుకు వీలులేదు. కాని మంచి తెలివైనది. తెలివైనదని ఆ కళ్లల్లోనే కనిపిస్తుంది. నవ్వు తున్నప్పుడు అంత అందమైనది కాదన్నమాట కూడా మరచిపోతాం.

ఈ అమ్మాయిని తలవని తలంపుగా కలుసు కున్నాను. జరిగినదిదీ. అది నాల్గవసారి ప్యారిస్‌కి నేను రావడం. ఒక చిన్న తోలుపెట్టె చేతితో పట్టుకొని నేను క్రిందటిసారి దిగిన హోటల్‌కే వెళ్లేను. ఈ హోటల్ యజమాని నాకు చాలా నచ్చినవాడు. మొదటి సంగతి

ఇంగ్లీష్ బాగావచ్చును. అదీకాక నాతో సరదాగా మాట్లాడుతూ ఉండేవాడు. వీలైనప్పుడల్లా నేను ఒంటరిగా భోజనం చెయ్యడం కాని, టీ తాగడం కాని జరుగకుండా తనతోటీ, తన కుటుంబంతోటీ కలసి కూర్చునేటట్టు చూసేవాడు. అతని భార్యా, ఇద్దరు చిన్న కొడుకులూ కూడా నేనంటే సరదాగా ఉండేవారు. క్రిందటిసారి ఒక సాయంత్రం ఆ ఇద్దరు కొడుకులనీ నేను సినీమాకి తీసుకువెళ్తానంటే తల్లి సరేనని ఒప్పుకుని, పెంకితనానికి తనని కూడా రమ్మని పిలవనందుకు కోపం తెచ్చుకున్నట్లు నటించింది. ఇలా వీళ్లందరినీ కూడా బాగా ఎరుగున్నాను కనుక అక్కడికే వెళ్లేను. ఈసారి హోటల్ అంతా క్రిక్కిరిసే ఉన్నప్పటికీ నాకొక మంచి గది ఏర్పాటు చేసేడా యజమాని. పది నిముషాలు దాటేక వస్తే నాకక్కడ చోటుండక పోవు నన్నాడు. యథాప్రకారంగానే నాకు సదుపాయాలవీ చేసిపెట్టేడు.

వచ్చిన మూడవరోజున ప్రొద్దుటినుంచి సాయంత్రం వరకూ గదిలోనే స్నేహితులతో కబుర్లు చెప్తూ కూర్చోడం నచ్చక, రోజంతా వేరే ఎక్కడో గడుపుదా మని నిశ్చయించుకుని, పదకొండు గంటలకే పైకి వెళ్తూ, ఆ రాత్రి పది గంటల వరకూ గదికి రానని హోటల్ యజమానితో చెప్పి వెళ్లిపోయాను. వెళ్ళి పోతుంటే అతని భార్య కూడా నవ్వుతూ ఈ రోజల్లా నీతో కాలక్షేపం చేసే అదృష్టవంతురాలి పేరేమిటో చెప్పమంది. 'మనిషినెవరినో ముందు స్థిరపరచు కున్నాక పేరు కనుక్కుందాం' అని జవాబు చెప్పేను... ముందు లూవ్రే చిత్రశాలకి వెళ్లేను. చూసిన చిత్రకళే, చూసిన శిల్పకళే మళ్లీ చూసేను. జగత్ప్రఖ్యాతి పొందిన లినార్డోడావించీ యొక్క 'మోనలిసా' చిత్రపటాన్నీ, అనేక శతాబ్దాల క్రిందట మైలో అనువాడు అతి సుందరంగా చెక్కిన వీనస్ శిల్పాన్నీ మళ్ళీ చూసేను. పూర్వం అంత రమ్యమైనవిగా కనపడని చిత్రపటాలు కొన్ని ఇప్పుడు చాలా ఆనందం కలుగజేసాయి. హిన్నర్ అను చిత్రకారుడిది 'చదువరి' అని ఒక పటం ఉందక్కడ. ఎంతో మనోహరంగా ఉంది. క్రిందటి మాటు దానిని నేను చూడనేలేదు. జుట్టు విరబోసుకుని, దుస్తులేమాత్రం కూడా లేకుండా, నేలమీద పడుకుని, తల కుడిచేతిమీద ఆన్చి పుస్తకం చదువుతోంది ఒకావిడ. ఆవిడ ధ్యానం అంతా ఆ పుస్తకం మీదనే. ఆ చిత్రపటాన్ని చూచిన వాళ్లకి కూడా ఆ పుస్తకం ఎదురుగుండా ఉండడం, ఆవిడ చదువులో మునిగి

## అసలు మనిషి రాకకోసం...!

వాళ్ళ చూపు ఎప్పుడూ
రేపటి సూర్యోదయం కోసమే!
ఆ రోజు ఎప్పుడో... ఎప్పుడూ ప్రశ్నార్థకమే
కరవు కోరల్లో చిక్కి
బీడువారిన మోడు భూములు
సాగయ్యేవి కావు,
బువ్వ పెట్టేవి అంతకన్నా కావు
అందుకే... నా బంధువులంతా
వలస బస్సెక్కి పోతున్నారు
అక్కడా... వాళ్ళకన్నీ
ప్రశ్నల పరంపరలే...
భవిష్యత్ ఏందీ అనే...!?
తప్పదు... వాళ్ళు బతకాలి
అందుకే, దళారి రాబందు పెట్టే
నరక యాతన
అనుభవిస్తూనే వున్నారు
నూకల మెతుకులు, మరిగీ మరగని చారు
పొలమారితే మురికి కాలువల్లో నీళ్ళేగతి
వాళ్ళ దినచర్యలో ముఖ్యఘట్టమిదే
ఎలా ఎందరో... ఎన్నో ఏళ్ళుగా
శ్రమదోపిడీకి గురౌతున్న
శ్రమనమ్మినోళ్ళు... జానెడు పొట్టకోసం
పడే పాట్లు మనసున్న ఏ మారాజునైనా
కరిగిస్తాయేమోనన్న
నా పాలమూరు వలస జీవుల ఆశలు
ఎండమావులనే మరిపిస్తున్నాయి.
ప్రభుత్వాలు మారినా...
తలరాతలు మారని
ఈ దీనజనం బతుకుల్లో
ఆశలు చిగురింపజేసే
అసలు మనిషి రాకకోసం
నా అక్షరం... నా కన్నీళ్ళూ...
వేచి చూస్తూనే వున్నాయి.

—కొత్తపల్లి మణీత్రినాథరాజు

# ముసలి బాధ

**వా**డు / పన్నెండేళ్లాయె / రెక్కలొచ్చి
గడ్డగాని గడ్డలో కాలుబెట్టి
నా బాసేలి / చిక్కుడాకుతో
గోడమింద గీసిన గీతలు
కండ్లల్లో సూదులైపోయె.
తన ఒంట్లో నెత్తురే లేనట్టు
గుండెకాయను ఎవుడో ఎత్తకపోయినట్టు
సెర్మాన్నికప్పుకున్న బొమికె మాదిర్తో
నా యింటిది
మంచికీ సెబ్బరకూ తోడయింది
ముక్కతా మూలగతా వుంటే
నా వొంట్లో సత్తవ కరిగిపోతా వుండాది.
ముసిల్ది మూగగొడ్డు / లోపలే కునారిల్లతింది
కడుపునిండా తిని కంటి నిండా నిద్రబొయ్యి
ఎన్నేండ్లయ్‌పోయనబ్బా.
నీకేం తక్కువా అంటారు అయినోళ్లు
లంకంత కొంప / సలవ గదులు సలవ నీళ్లు
వండేదానికో మనిసి
కారు తోలేదానికో డైవరు
ఇన్ని వసద్దులుండాయే
అనుబగించక ఏడత్తావేం అంటారు.
పేగుబాధ తెల్సినోళ్లే నా వాళ్లు.
రక్తం పంచుకున్నోడు
అపురూపంగా సాక్కున్నోడు
నడిమంతరాన మమ్మల్ని వొదిలేసి
పరాయి మట్టిలో వోడుంటే
ఎన్ని వసద్దులుంటే మాత్రం
కంటికి నిద్రొస్తిందా?
వొంటికి సుఖముంటిందా?
కండ్లల్లో నీళ్లు యిగిరిపోవా?
ఏర్లు తెగిన మా బతుకు సెట్లు
ఎన్నాళ్లు ప్యాణాలతో వుంటాయి
నీళ్లుబోసినా ఎరువేసినా
సిగుళ్లొచ్చేనా? సింతలు తీరేనా?
నా ముసిల్ది / మళ్లీ వొాక గీత గీస్తావుంటే
మా గుండెకాయల్ని
రంపంతో కోసినట్టుండయ్యా.

-మునిసుందరం

ఉండడం మిగిలిన మనోవికారాలకి ఏమాత్రం చోటియ్యవు. దిగంబర స్త్రీల చిత్రపటాలనేకం చూసేను. కాని ఇంత నిర్మలమైన కళ వాటిలో నేనెన్నడూ చూడలేదు.

సాయంత్రం మూడు గంటల వరకూ లూవ్రే చిత్రశాలలోనే తిరిగేను. తర్వాత ఏమి చేసేందుకూ తోచలేదు. కొంతసేపు ట్యూలరీస్ వనంలో అర్థం లేకుండా తిరిగేను. సినీమాకి వెళ్లడానికి బుద్ధిపుట్టలేదు. చెయ్యగలిగినది మరేమీ కనబడలేదు. ఆఖరాఖరికి లండన్ వదలి ఈసారి పారిస్ నేనెందుకు వచ్చినట్టని నాలో నేను విచారించడం మొదలెట్టేను. మొన్నాడు పొద్దున్నే బయలుదేరి లండన్‌కి పోవాలని నిశ్చయించుకున్నాను. నాలుగు గంటలయింది. ఆ వనంలో ఒక బల్లమీద వెళ్ళి కూర్చునేసరికి పక్కని ఇద్దరు ముసలివాళ్ళు నేను ఆఫ్రికా దేశస్థుడనా, ఇండియా దేశస్థుడనా అని వాదించుకోడం మొదలెట్టేరు. నేను ఫ్రెంచి భాష బాగా మాట్లాడలేకపోయినా చాలావరకు బోధపరచుకోగలను. వారిలో ఒకడు నన్ను 'ఫ్రెంచి మాట్లాడగలవా?' అని ప్రశ్నించాడు. నాకు ఫ్రెంచి భాష రాదని సంజ్ఞలు చేసేను. ఒక్క ప్రశ్నకు మటుక్కు 'నా దేశం ఇండియా' అని జవాబు చెప్పగలిగేను. అప్పుడు వాళ్ళల్లో ఒకడు 'చూసేవా? నేనన్నట్టే ఈ మనిషి పెదవులు నీగ్రోల పెదవులలాగ ముందుకు పొడుచుకు రావడంలేదు. చూడు' అన్నాడు. రెండవ వాడు ముందుకు వంగి నాకేసి చూడబోతుంటే ఇదెక్కడి బాధని చెప్పి లేచి వెళ్ళిపోయాను.

తిన్నగా హోటల్‌కే వెళ్ళిపోయాను. రాత్రి పది గంటలదాకా రానన్న వాడిని సాయంత్రం అయిదు కొట్టకుండానే వచ్చేసేను. లోపల కాలు పెట్టగానే యజమాని నాకేసి దెయ్యాన్ని చూస్తున్నవాడిలా హడిలిపోతూ చూసేడు. ఏమీ తోచకపోవడం వల్ల ముందుగానే వచ్చేనని నవ్వుతూ సమాధానం చెప్పేను. ఇంతట్లో అతని భార్య వచ్చింది. తను కూడా నాకేసి ఏమిటో అతి కంగారుగా చూడడం మొదలెట్టింది. 'మీరు పది గంటల వరకూ రారనుకుంటున్నాం' అంది. తనకి కూడా బోధపరిచాను నా చిక్కులు. నా గదికి పోదాం అని మెట్లెక్కబోతుంటే హడావిడిగా నా వెంట వచ్చి ఆ యజమాని ఈ రోజుకి వాళ్లతో క్రిందనే టీ పుచ్చుకోమని బ్రతిమాలేడు. సరేకాని, ముఖం కడుక్కునేందుకు గదికి వెళ్లాలన్నాను. యజమాని భార్య ఎంతో ఆప్యాయంగా క్రిందనే కొత్త సబ్బుబిళ్లా, తువ్వాలూ ఇస్తా

నంది. ఇదంతా నాకేమీ బోధపడలేదు. ఆఖరికి వాళ్ళిద్దరికేసి చూసి చూసి ఈ గందరగోళం అంతా ఏమిటో తిన్నగా బోధపరచమన్నాను. 'చాలా బుద్ధి పొరపాటయింది; క్షమించాలి' అంటూ మొదలెట్టేడా హోటల్ యజమాని. మరేమీ పరవాలేదు. చెప్పండన్నాను. అప్పుడు చెప్పేరు.

నేను వెళ్ళిపోయాక రమారమి ఒంటిగంటన్నరకి ఒక అమ్మాయితో ఫ్రెంచి కుర్రాడొకడొచ్చి సాయంత్రం అయిదు గంటల వరకూ ఒక గది కావాలన్నాడట. యజమాని ముందర గదులేవీ ఖాళీగా లేవని జవాబిచ్చాడు. కాని ఆ కుర్రాడు ఇటూ అటూ చూస్తూ నుంచునేసరికి జాలికలిగి నా గదిమాటా, నేను పదిగంటల వరకు రాననడం, జ్ఞాపకం వచ్చాయట. వచ్చిన వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కారని తెలుసును. అయినా యజమాని అయిదు గంటలకి సరిగ్గా వెళ్ళిపోయేటట్టయితే నా గది వాడుకోవచ్చునని ఒప్పుకున్నాడట. నా అనుమతి లేనిది అలా ఒప్పుకోడం చాలా తప్పనీ, క్షమించమనీ వెయ్యిసార్లు అతను నన్ను బ్రతిమాలుకున్నాడు. ఇందులో క్షమించకుండా ఉండేం దుకు ఏమీలేదనీ, తను చేసినదల్లా నా ఒప్పుదలతో నన్నుమాటేనని బదులు చెప్పేను.

ముఖం కడుక్కోకుండానే టీ తాగడానికి సిద్ధ పడ్డాను. మేము టీ తాగడానికి వెళ్లబోతుంటే ఆ అబ్బాయి, అమ్మాయి మెట్లు దిగేరు. ఇద్దరికీ కూడా ఇరవై, ఇరవై రెండేళ్లకి పైనుండవు. హోటల్ యజమాని నాకేసి పెంకితనంగా చూస్తూ నెమ్మదిగా, 'వీరిద్దరే ఇంతసేపూ మీ గదిలో ఉంట' అన్నాడు. దగ్గరగా వచ్చాక వారితో నాకు పరిచయం కలిపేడు. కుర్రవాడి పేరు ఫిలిప్‌డోబ్రే. అమ్మాయి పేరేమిటని తడుము కుంటుంటే రెనీబర్నే అని తనే చెప్పింది. టీ పుచ్చు కునేందుకు వాళ్ళిద్దర్నీ కూడా రమ్మన్నాం. కాసేపు వాళ్లల్లో వాళ్లాలోచించుకుని ఆఖరికి 'సరే'నన్నారు. టీ తాగడానికి కూర్చోబోయేముందు హోటల్ యజమాని పుస్తకాల బీరువాలో నుంచి రెండు పుస్తకాలు తీసి చూస్తూ నుంచుంది రెనీ. అవి ఏమిటని నేనడిగితే చూడమని నాకందిచ్చింది. ఒకటి షేక్స్పియర్ నాటకాలు, రెండవది జర్మన్ కవి గొయ్‌టే వ్రాసిన ఫాస్ట్. నేనంతవరకూ వీరిరువురికీ కూడా ఫ్రెంచి తప్ప మరే భాషా రాదనుకున్నాను. ఇప్పుడడిగితే ఫిలిప్‌కి ఫ్రెంచొక్కటే వచ్చును కాని, రెనీకి ఫ్రెంచే కాకుండా ఇంగ్లీషూ, జర్మన్ వచ్చునని తేలింది. షేక్స్పియర్

## చిన్ని గాయాలు

గుండె తీసి
గుండె పెడతారు
మరి
మనసు తీసి
మనసు పెట్టరేం

ఎన్ని కోట్ల వరద తాకిళ్ళకు
కొట్టుకొని తట్టుకుందో
ఆ రాయి
అందమైన గుండ్రాయి
అవతారమెత్తింది

పదిరోజుల్లేకపోయేసరికి
రూములోని దోమలన్నీ
చచ్చిపడున్నాయి
ఎంత ఆకలి మేశాయో!

బాబా విశ్వరూపం
బాకా మోగింది
భక్తులు ఎగబడ్డారు
పాపం
మేకప్ మాన్ రాలేదు

భారతంలో
సగటు స్త్రీ
అంట్ల తపేలాల
మేస్త్రీ

ఆమె
రాత్రులు చెవులు కొరుకుతుంది
ఏమి హాయిలే హలా!
పగళ్ళు పళ్ళు కొరుకుతుంది
ఎంత బాధలే గురూ!

నిన్నే!
కలల్లోకొచ్చి
చంపకపోతే
జీవితంలోకొచ్చి
బతికించరాదూ!

-అయినాల కనకరత్నాచారి

నాటకాలన్నీ చదివేనంది. ఇంగ్లీషు కవులంటే చాలా సరదా అంది. జర్మన్ భాషలో కూడ చాల పుస్తకాలు చదివేనంది. కవులందరిలోనూ షిల్లర్ తనకి ప్రత్యేకంగా నచ్చినవాడంది. 'గొప్ప చదువరివన్నమాట?' అన్నాను. 'చదువరి' అన్నమాట పైనపడగానే లూవ్రేలో చూసిన చిత్రపటం జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆ విషయమై చెప్పి, 'ఎన్నడైనా ఆ చిత్రపటం చూసేవా?' అనడిగేను రెనీని.

"హెన్నర్ అన్న చిత్రకారుడు చిత్రించినదేనా?"

## బికారి - సంసారి

**ఊ**రూ పేరూ లేదు
ఉద్యోగం సద్యోగం లేదు
ఇల్లూ ఇల్లాలు లేదు
అతడు బికారి!
పేరూ ప్రఖ్యాతలున్నాయి
ఊరూ ఉద్యోగముంది
భార్యా బిడ్డలున్నారు
ఇల్లూ ఇగురముంది
డబ్బూ దస్కముంది
అతడు సంసారి!
ఏమీలేని బికారి
వేలకు తింటున్నాడు
ముద్ద వేసిన ముదితే
వాడికి కన్నతల్లి
వీధే వాడి గృహం
లోకమే వాడికి సర్వస్వం!
అంగట్లో అన్నీ ఉన్నాయి
అల్లుడి నోట్లో శని ఉంది
తింటే అరగదు
ఒంటికి ఏదీ పడదు
ఆశకు సరిపడని జీతం
అశాంతికి నిలయమైన జీవితం!
బికారికి
ఏమీలేకున్నా
అన్నీ ఉన్నట్లే!
సంసారికి
అన్నీ ఎదుటే ఉన్నా
ఏమీ లేనట్లే!

-దేవి యాదగిరి

"అవును."

"చూసేను. అసలు నాకు చాలా నచ్చిందది. దాని ప్రతి కూడా నా దగ్గరుంది. కాని చిత్రకళాపండితు లెవరూ అదంత గొప్పదని ఒప్పుకోరు."

"నిజంగా?"

"అవును. ఎవరూ దాని నంతగా మెచ్చుకోలేదు. నాకుమట్టుకు అఖండంగా నచ్చిందది... ఎవరో కవికి కలలో కనబడిన విచిత్ర దృశ్యంలా ఉంటుంది. కాని, కామోద్రేకం కలుగజేసే సామాన్య మానవ శరీరంలా కనబడనే కనబడదది. దానిలో చిత్రకళకంటే కవిత్వ ధోరణి హెచ్చుంది... ఇదే మొదటిసారి నాకు దానినంతగా మెచ్చుకునేవారు మరొకరు కనబడడం."

ఈ పటం గురించి జరిగిన సంభాషణలో తేలిన విషయాలేమిటంటే- ఫిలిప్ లూవ్రే చిత్రశాల చూసి ఆరేళ్లయిందనీ, ఆరేళ్ల క్రితం చూసినది తనకేమీ జ్ఞాపకం లేదనీ, మా హోటల్ యజమాని నిజం చెప్పడానికి సిగ్గుపడకపోతే అతను లూవ్రే చిత్రశాల ఎన్నడూ చూడనే లేదనీ, అతని భార్యకి లూవ్రే అంటే ఏమిటో తెలుసునో తెలియదో కూడా సందేహాస్పద మనీ!

టీ తాగడం అయాక వాళ్ళిద్దరూ వెళ్ళేందుకు లేచేరు. వెళ్లబోతూ ఫిలిప్ యజమానిని పక్కకి పిలిచి ఆ గదికి కొంత డబ్బివ్వబోయాడు. అప్పుడతను నాకేసి చూపిస్తూ గది నాదనీ, తనకేమీ డబ్బు పుచ్చుకునేందుకు హక్కులేదనీ బోధపరచాడు. నేను కూడా యజమాని వారిని గురించి నాతో చెప్పేదనీ, డబ్బేమీ ఇచ్చేందుకు వీలులేదనీ అన్నాను. అప్పటివరకూ వాళ్ళిద్దరూ గ్రహించలేదు హోటల్ మనిషి వాళ్ల సంగతంతా నాకు చెప్పేసేదని. రెనీకి అమితమైన సిగ్గూ, అమితమైన కోపం కూడా సంభవించాయి. మా యజమాని మట్టుకు ఈ మాత్రం దానిలో తప్పేమిటని వాదించాడు. 'గది మరొకరిదని చెప్తే మేమిక్కడ ఉండకనే పోదుం' అన్నాడు ఫిలిప్. 'నీతో నేనిక్కడికి రావడమే బుద్ధిపొరపా'టంది రెనీ ఫిలిప్‌తో. ఫిలిప్ ఉద్రేకం మరీ హెచ్చయింది. మా యజమానికేసి చూస్తూ, 'మా సంగతి ఊళ్లో వాళ్లందరికి చెప్పేందుకు నువ్వెవడవు?' అన్నాడు. యజమాని ఈ బాధంతా ఎందుకు తెచ్చి పెట్టుకున్నానురా! అని తల తడుముకుంటూ మరొక వైపు చూస్తూ నుంచున్నాడు. నేను తనపక్షాన్నీ, నా పక్షాన్నీ కూడా క్షమార్పణ కోరేను. కొంతసేపటి వరకూ ఇద్దరూ మాట్లాడలేదు. నేనింకా దీనంగా మాట్లాడు

తుంటే ఇంతవరకూ నాకేసి చూడకుండా నుంచున్న రెనీ 'మీ తప్పేమీ లేదు. అంతా ఆ యజమానిదే. మీరెందుకు క్షమించమనడం?' అంది. 'ఇద్దరిదీ తప్పే. ఇద్దరిదీ కాదు. ఇంతకీ జరిగిన హానేమీ లేదుకదా!' అన్నాను. 'మిమ్మల్నేమీ అనడంలేదు సుమండీ' అంది మళ్ళీ. 'ఈ హోటల్‌కి నేనెన్నడూ రా'నన్నాడు ఫిలిప్. "నీతో ఇలా ఇక నేనెన్నడూ రా"నంది రెనీ అతి నిశ్చయంగా. వాళ్ళీ మాటలయాక గుమ్మందాటి వీధిలోకి వెళ్తుంటే వాళ్ళ వెంట నేనూ వెళ్లేను. నేనింత సేపూ ఇంగ్లీషులో మాట్లాడుతూ ఉండడంబట్టి ఫిలిప్ నేనన్నదేమీ బోధపరుచుకోలేకపోతున్నాడు. అయినా నేను నా తప్పుడు ఫ్రెంచి భాష ప్రయోగించకుండా ఇంకా ఇంగ్లీషులోనే మాట్లాడేను. 'మళ్ళీ మిమ్మల్నెప్పుడు నేను చూడడం?' అనడిగేను. ఫిలిప్ ఏమిటంటే, రెనీ నా ప్రశ్న ఫ్రెంచిలో బోధపరచింది. 'ఈ హోటల్‌కి మళ్ళీ మేము ఎన్నడూ రాదలచుకోలేదే' అన్నాడు ఫిలిప్. ఆ మాట నేను బోధపరచుకున్నా కూడా రెనీ భాషాంతరీకరణం చేసి చెప్పింది. 'ఇక్కడ కాదు. మనం మరెక్కడన్నా మళ్ళీ కలుసుకుందాం' అన్నాను. వాళ్ళు నాకు జవాబిచ్చేందుకు సందేహిస్తూంటే రెనీతో, 'నేనూ నీలాగే ఇంగ్లీషులోనూ, జర్మన్‌లోనూ చాలా పుస్తకాలు చదివినవాడిని. మనిద్దరం కలసి మాట్లాడగలిగిన విషయాలు చాలా ఉంటాయి. నాకు కూడా ఇంగ్లీషు కవులంటే ప్రాణం... రేపు మీరిద్దరూ వస్తే ఎక్కడైనా టీ పుచ్చుకుని తర్వాత సినిమాకి వెళ్దాం' అన్నాను. రెనీ 'సరే'నంది. ఫిలిప్‌కి బోధపరచింది. ఫిలిప్ కూడా నాకేసి తీక్షణంగా చూస్తూ సరేనని తలఊపేడు. మొన్నాడు ఎక్కడ కలుసుకునేదీ స్థిరపరచుకొని వాళ్ల తోవనివాళ్లూ, నాతోవని నేనూ వెళ్తూ విడిపోయాం... హోటల్‌లో మళ్ళీ ఫిలిప్ గురించి మాట్లాడేం. యజమానీ అతని భార్యా కూడా ఫిలిప్ చాలా మంచివాడిలా కనిపిస్తాడనీ, రెనీ చాలా గయ్యాళిలా కనిపిస్తుందనీ అన్నారు. వాళ్ళతో వాదించడం ఇష్టంలేక 'అవు'నన్నాను.

మొన్నాడు రెనీ, ఫిలిప్, నేనూ కలుసుకున్నప్పుడు ముందటిరోజు విషయాలేమీ మాట్లాడలేదు. రెనీ ఎంతో హాయిగా మాట్లాడడం మొదలెట్టింది నాతో. ఫిలిప్ కూడ కొంత టీ తాగేక సరదాగా కబుర్లు చెప్పేడు. వీళ్ళు చిన్నప్పటి నుంచీ ఒకరినొకరు ఎరుగుదురట. ఫిలిప్‌కి రెనీ అంటే అనేక సంవత్సరాలబట్టి అమితమైన ప్రేమ. ఫిలిప్ తండ్రి వర్తకుడు. అంత మరీ ధనవంతుడు కాదు. కాని ధనవంతుడే. రెనీ తండ్రి బీదవాడు. రెనీకి కొంత చదువు చెప్పించాడు కాని, పారిస్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించడానికి డబ్బులేక మానేసింది. ఉద్యోగానికి ప్రయత్నం చేస్తోందిప్పుడు. చదువంటే చాలా అభిలాష. తంటాలుపడి ఇంగ్లీషుభాషా, జర్మను భాషా కూడా నేర్చుకుంది. ఫిలిప్ తండ్రికీ రెనీ సంగతి తెలుసును. పేద కుటుంబంలో పుట్టినదని, రెనీతో తిరుగవద్దని ఫిలిప్‌ని ఆజ్ఞాపించాడు. ఫిలిప్ సరేనని ఒప్పుకుని దొంగతనంగా ఇలా రెనీతో కాలం గడుపుతున్నాడు. తన చేతిలో ధనం ఉంటే రెనీని వెంటనే పెళ్ళిచేసుకునేందుకు సంసిద్ధుడై ఉన్నాడు. కాని ఇవి వచ్చే ఆస్తులు వదలుకోవలసిన రోజులు కావు. వాళ్ళ బాధల కంతా ఇదే మూలకారణం... 'ఇక నీ సంగతి' అన్నారు. చెప్పవలసినదేదో చెప్పేను. కాసేపయాక మాటల సందర్భంలో 'ఈసారి పారిస్‌లో ఏమిటో కాని నాకేమీ తోచడం'లేదన్నాను. రెనీ నాకేసి నవ్వుతూ 'పారిస్ నగరంలో అంత తోచకపోవడం, అంత ఒంటరిగా ఉండడం ఎందువల్లను?' అంది. 'నాకు ఫ్రెంచి బాగా రాదు సరిగదా, నేనంత సులభంగా మనుష్యులతో స్నేహం చెయ్యలేను కూడా' అన్నాను. 'ఇక్కడ కన్ను గీటితే కోటికాంతలే' అంది. కన్నుగీటడంలో నాకంత అభ్యాసంలేదనీ, అయినా కన్నుగీటుకి వెంటబడే కాంత లంటే నాకంత అభిప్రాయంలేదనీ చెప్పేను. 'నువ్వు మేధావంతుడవని కనిపెట్టి పారిస్‌లో స్త్రీలందరూ నిన్ను ప్రేమించాలని కాబోలు నీ ఉద్దేశ్యం' అంది రెనీ పెంకి తనంగా. 'అంత తలతిరుగుడి వాడిలా కనిపిస్తున్నానా?' అనడిగేను.

పత్రికలో ప్రకటనలు చూసి, వెళ్లే సినిమా ఏదో

## రూపాలు..!

రాయికి రూపం తెచ్చేవాడు... శిల్పి
శిష్యునికి రూపం తెచ్చేవాడు... గురువు
మనిషికి రూపం... శీలం
మనస్సుకి రూపం... ధర్మం
భక్తునికి రూపం... దైవం
సంతోషానికి రూపం... ఆనందం
పత్రికకు రూపం... అక్షరాలు
వినాశానికి రూపం... కక్ష
రూపంలేని రూపం... దైవం

-పోడూరి ప్రభాకర్‌దత్తు

# మన్నెందొర

ప్రజల కోసం తిరిగినావు
ప్రజల బాధల్ని చెప్పినావు
అమాయకులు అర్చకులని
ప్రజలకు తోడై మసలినావు
మండె గుండెల బాధల్ని
వెలికితీసి చూపినావు
మన్నెం ప్రజల బాధల్ని
ధైర్యంగా చెప్పినావు
దేశం కోసం గ్రామం కోసం
తెల్లదొరల నెదిరించావు
అహర్నిశము శ్రమించావు
అందరి కోసం జీవించావు
విప్లవాగ్ని రగిల్చావు
విజయ సారథివై కదిలావు
మాటల తూటాలకే దద్దరిల్లిరి
మారణాయుధములతో నిన్నెదిరించిరి
నీచమైన నికృష్టులు
నీపై పగబట్టిరి
ఆయుధము పట్టని నిన్ను
అదములే కొట్టిరి
భారత సింహానివి నీవు
స్వాతంత్ర్య యోధుడివి నీవు
సర్వజనుల సుఖం కోరిన
సుందర స్వప్నానివి నీవు.

*-లింగర్‌కర్ దయానంద్*

నిశ్చయించుకున్నాం. టిక్కెట్లు కొని లోపల కూర్చోబోతుంటే ఫిలిప్ రెనీకీ నాకూ మధ్యని కూర్చోబోయాడు. పాశ్చాత్య దేశాలలో ఇద్దరు పురుషులతో ఒక స్త్రీ వస్తే, ఆ స్త్రీ ఇద్దరి పురుషుల మధ్యనీ కూర్చోవాలి. లేకపోతే అందులో ఒకరిని అమర్యాద చేసినట్టు. రెనీ వెంటనే ఫిలిప్‌ని పక్కకి వెళ్లమని తను మధ్యని కూర్చుంది. ఇద్దరూ కొంచెం వాదించుకున్నారు. నేనేమీ చూడనట్టూ, విననట్టూ నటించాను. కాని జరిగినదేమిటంటే ఆ నిముషం నుంచి ఫిలిప్ నాతో సరదాగా మాట్లాడడం మానేసేడు. దానికి బదులు రెనీ నాతో మరీ చనువుగా మాట్లాడటం మొదలెట్టింది. మేమిద్దరం అంతసేపూ ఇంగ్లీషులో మాట్లాడుతూ ఉండడం ఫిలిప్‌కి నచ్చుడంలేదు. నిముష నిముషానికీ రెనీని మాట్లాడేదేమిటని అడుగుతూ వచ్చాడు. కొన్నిసార్లు సావధానంగా జవాబులిచ్చింది. ఆఖరాఖరికి తనకు విసుగు పుట్టింది. చివరికి నాకేసి తిరిగి 'మనం ఇంగ్లీషులో ఏమేమి రహస్యాలు చెప్పేసుకుంటున్నామో అని అనుమానపడిపోతున్నాడు ఫిలిప్' అంది. తనామాట అనేసరికి నాకు సిగ్గేసింది. తన స్నేహితుడిని ఈ మాత్రానికే ఇరవై నాలుగు గంటలు మాత్రమే ఎరుగున్న నా దగ్గర అంత చులకన చేస్తోందని కొంత కోపం గూడా వచ్చింది. నా ఆశ్చర్యం అంతతో నిలిచిపోలేదు. రెనీ సంవత్సరాలకొలదీ ఎరుగున్న స్నేహితుడితో లాగ ఫిలిప్ గురించి నాతో మాట్లాడడం మొదలెట్టింది. కవిత్వం అన్నా, కళలన్నా ఫిలిప్‌కి ఏమీ బోధపడదంది. ఫిలిప్‌కి రెండే ముఖ్యమట- డబ్బూ, రెనీ. తను మరొకరితో, ఆడవాళ్లయ్యేది మొగవాళ్లయేది, స్నేహంగా ఉండడం ఫిలిప్ సహించలేడట. చాలా మంచివాడేకాని ఇలాంటి గుణాలు చూస్తే అప్పుడప్పుడు చికాకుగా ఉంటుందంది. నాకామాటలు వింటుంటే నేనీ ఇద్దరితో సహవాసం కలుపుకోడం చాలా తెలివి తక్కువ అనిపించింది. 'అంత నచ్చని వాడయితే, ఫిలిప్‌కి తను, స్త్రీ పురుషుడి కివ్వగలిగినంత చనువూ ఇచ్చేసిందే. ఎలా ఇవ్వగలిగిందా?' అని బోధపరుచుకునేందుకు ప్రయత్నించాను. తర్వాత, ఈ విషయాలన్నీ అటుపక్క ఫిలిప్‌ని పెట్టుకుని నాతో ఎందుకు చర్చించాలి? ఆగలేక అడిగేసేను:

"నిన్ననే మొదటిసారి చూసిన నాతో ఈ సంగతులన్నీ ఇంత వివరంగా చెప్పడంలో న్యాయం ఏమిటి?"

నేనా ప్రశ్న వేసేసరికి నావైపు అతిదీనంగా చూసింది రెనీ.

"నిన్ను చూసినప్పటి నుంచీ నువ్వు నన్ను సమంగా బోధపరుచుకోగలవని పొరపాటున ఆశపడ్డాను" అంది.

"ఎవరైనా సరే, ఒక్క రోజులో ఎవరినైనా బోధపరుచుకోగలరా?"

"నీకూ నాకూ ఇష్టాయిష్టాలన్నీ చాలావరకు సమానం అని తోచింది. మరొకమాట. పారిస్‌కి వచ్చి వీధిలో వారకాంతల వెంటబడని విదేశీయులంటే ఎవరికైనా గౌరవమే."

"నేనెన్నడూ వారివెంట బడలేదని నీకేమిటీ ధైర్యం"

"నాకు తెలుసును... అదికాక ఆంగ్లేయ కవుల గురించీ, జర్మన్ గ్రంథకర్తల గురించీ నాతో మాట్లాడ

గలిగినవాడవు, విదేశీయుడవు ఇన్నాళ్ళకు నువ్వొక్కడవు కనిపించావు... నేను పారిస్‌లో గొప్పవాళ్ళనికాని, చదువుకున్న వాళ్ళనికాని ఎవరినీ అంత ఎరగను... ఇవన్నీ అటుండగా, నా లూవ్రే చిత్రపటాన్ని నువ్వు కూడా పొగడడం సామాన్యమైన వింత కాదు. ఇప్పుడు కూడా నిజంగా, ఫిలిప్‌కంటే నువ్వే నన్ను బాగా బోధపరుచుకోగలవని నా నమ్మకం."

రెనీ చెప్పేది యావత్తూ నిజమని నేనప్పుడు గ్రహించాను. నిజం కనుకనే తనతో పరిచయం వృద్ధిపరచుకునేందుకు నాకూ ముందటిరోజున కోరిక కలిగింది. కాని ఇది చాలా హానికరమైన స్థితి అని కనిపెట్టేను. మరొక వారం రోజులు రెనీకి, ఫిలిప్‌కీ మధ్యని నేనున్నానంటే వాళ్ళిద్దరూ పోట్లాడి విడిపోతారని నాకు తెలుసును. ఈ సాయంత్రం గడచిన తర్వాత రెనీని నేనెన్నడూ కలుసుకోకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాను. మనుష్యమాత్రులమే కనుక ఆలోచించకుండా ఎంతమంది జీవితాలు నిరర్థకం చేస్తామో మనకే తెలియదు. ఈ విషయంలో మట్టుకు నేను కళ్ళుమూసుకొని గోతిలో పడకూడదనుకున్నాను.

సినిమాలోంచి ముగ్గురం వచ్చేసేం పైకి. నా కోరిక నెరవేర్చి నాతో సినీమాకి వచ్చినందుకు వాళ్ళిద్దరికీ నా వందనాలర్పించాను. అదయాక చటుక్కున 'నాకు వేరే పనుంది. నేను పోవా'లన్నాను. రెనీ నాకేసి ఆశ్చర్యంగా చూస్తూ నుంచుంది. ఫిలిప్ 'మళ్ళీ ఎప్పుడు నిన్ను చూడడం' అన్నాడు. ఈ లోకంలో ఇలాగే అన్నీ అనుకోనట్టు జరుగుతాయి. మాట్లాడకుండా ఇద్దరూ వెళ్ళిపోతారనుకున్నాను. ముందుగా మాట్లాడినది ఫిలిప్!

"నేను రేపే లండన్ వెళ్ళిపోతున్నాను."

"అప్పుడేనా?" అంది రెనీ.

"నువ్వే మమ్మల్ని టీకీ, సినిమాకీ పిలిచావు కాని, నిన్ను మేము పిలవనక్కరలేదా?" అన్నాడు ఫిలిప్. రెనీ ఆ మాటే నాకు ఇంగ్లీషులో చెప్పింది.

"ఈ విషయంలో అంత కట్టుబాటేమిటి?... పరవాలేదు. మళ్ళీ ప్యారిస్ వచ్చినప్పుడు నాకీ మర్యాదలన్నీ చేద్దురుగాని."

"వీలులేదు. రేపు సాయంత్రం నాలుగు గంటలకి ప్లేస్ డి లా మేడలైన్ దగ్గర మమ్మల్ని నువ్వు కలుసుకోవాలి" అన్నాడు ఫిలిప్.

"కాని రేపు ప్రొద్దున్న నేను వెళ్ళిపోతున్నాను."

"రేపు వెళ్లేందుకు వీలులేదు" అంది రెనీ.

"సరే" అన్నాను.

మొన్నాడు నాలుగు గంటలకి అనుకున్నచోట సిద్ధం నేను. నా చేతిలో రెండు పుస్తకాలున్నాయి. మొదటిది గాంధీమహాత్ముని 'స్వీయచరిత్రం.' రెండవది రవీంద్రుని 'గీతాంజలి'. ప్రొద్దున్న తిరుగుతుంటే ఒక పుస్తకాల కొట్టులో ఈ రెండూ కనబడ్డాయి. రెనీకివి కొని బహుమానంగా ఇవ్వాలని బుద్ధిపుట్టింది. వెంటనే కొన్నాను, రెనీ వీటిని చూసి చాలా సంతోషిస్తుందని నాకు తెలుసును. ఫిలిప్‌తో రెనీ వచ్చేసరికి పది నిముషాల ఆలస్యం అయింది. ఆలస్యానికి క్షమించమన్నాడు ఫిలిప్. రాగానే నా చేతిలో ఉన్న పుస్తకాలు చూసి 'అవి ఏమిటి?' అనడిగింది రెనీ. 'నువ్వు చూడవలసినవి కావు' అన్నాను.

## జలీ 'కిరణాలు'

### స్నేహం

ఒంటరితనంతో
పోరాడే వారికి
కావల్సిన మనోబలం

### పెళ్ళి

సహ జీవనం
?
సహ నివాసం

ENTERED

### కోడలు

కొడుకు కంట్లో
చిలుక
అత్త కంట్లో
నలక

### విత్తనం

నిక్షిప్త
భవిష్యత్
మొలక

### వెన్నెల

సూర్య కాంతికి
శీతల ప్రతిబింబం.

-డా॥ జరీనా బేగం

"అందుకే చూపించు"

"తర్వాత చూపిస్తాను"

ఒక 'కెఫే'లో కూర్చుని కాఫీ త్రాగుతుండగా రెనీకి ఆ పుస్తకాలు చూపించాను. నేను వాటిని తనకే కొన్నానని లోపలివ్రాత చూడగానే పరిమితంలేని ఆనందం వెల్లడిజేస్తూ 'నువ్వింత మంచివాడవని నేననుకోలే' అంది.

ఫిలిప్ కొంచెం ఈర్ష్య దాచీ దాచుకోనట్టు, పెంకితనంగా, 'రెండు పుస్తకాలూ రెనీకే అయితే నాకేమిటి?' అన్నాడు.

"పుస్తకాలు రెనీవి, రెనీ నీది" అన్నాను.

ఇద్దరు నవ్వుకున్నారు. ఫిలిప్ ఆ సరదాలో రెనీ భుజంమీద తన చెయ్యి వేసేడు. ఫిలిప్‌కేసి చూడకుండా ఆ చెయ్యి తొలగించుకుని, రెనీ "సరిగ్గా నాకివ్వవలసిన పుస్తకాలే ఇచ్చావు నువ్వు... నిజంగా చెప్తున్నాను. నిన్ను సంతోషపెట్టాలని కాదు. ఎన్నేళ్లబట్టో ఇండియా దేశం చూడాలని నాకు గొప్ప ఆశ. ఈ జన్మలో తీరని కోరికలలో అదొకటి" అంది.

"ఆ చెల్లని కోరికలలో మిగిలినవి ఏమిటి?" అనడిగేను అల్లరికి. రెనీ జవాబు చెప్పలేదు.

"ఏదైనా నాటకానికి కాని, సినీమాకి కాని వెళ్దామా?" అన్నాడు ఫిలిప్.

వద్దన్నాను నేను. రెనీ కూడా వద్దంది. మరేమిటని ఆలోచిస్తే, రెనీ ఏదైనా తోటలోకి వెళ్ళి కాసేపు నడిచి ఎక్కడైనా కూర్చుందాం అంది. బోయ్‌దిబొలోన్ అన్న చోటికి వెళ్లేం. సరదాగా మాట్లాడుతూ చీకటి పడే వరకూ నడిచేం. ఆఖరికి నేను వెళ్ళిపోవాలంటుంటే కాసేపు అక్కడ బల్లలమీద కూర్చుని తర్వాత వెళ్ళిపోదాం అంది రెనీ. చీకటిలో ఒక బల్లమీద ముగ్గురం కూర్చున్నాక రెనీ మౌనం దాల్చింది. నేనూ ఫిలిప్ మట్టుకు మాట్లాడుకుంటున్నాం. నా తప్పుడు ఫ్రెంచి తోటే తంటాలు పడుతున్నాను. అప్పుడప్పుడు రెనీ చేత తప్పులు దిద్దించి నా మాటలు బోధపడేటట్టు చేస్తున్నాను. మొన్నాడు నేను లండన్‌కి వెళ్తున్నా నన్నాను. ఫిలిప్ నన్ను లండన్ గురించి అనేక ప్రశ్నలు వేస్తున్నాడు. రెండు మూడు నెలల్లో తనక్కడకి వస్తానన్నాడు. 'రెనీ కూడ వస్తుందా?' అనడిగితే 'నాకు లండన్‌తో పనేమిటి?' అని జవాబిచ్చింది. ఇలా ఉండగా కొంచెం దూరంలో 'ఫిగారో! ఫిగారో!' అని ఒక పారిస్ పత్రికని అమ్ముతూ కుర్రాడు కేకలు వేస్తున్నాడు. రెనీ ఫిలిప్‌ని వెళ్ళి ఒక పత్రిక కొని తెమ్మంది. 'వెళ్ళిపోతూ తోవలో కొనవచ్చు'నన్నాడు ఫిలిప్. తర్వాత పత్రికలు మిగులుతాయో లేదో ఇప్పుడే కొనమంది. నేను వెళ్ళి కొంటానని లేచేసరికి, వద్దని తనే విధేయుడిలా లేచి వెళ్లేడు ఫిలిప్.

అతను కొంత దూరం వెళ్ళగానే నా రెండు చేతులూ గట్టిగా తన రెండు చేతులతోనూ పట్టుకుంది రెనీ.

"నువ్వు రేపు వెళ్ళడానికి వీలులేదు... ముమ్మాటికీ వీలులేదు" అంది.

"ఇదేమిటి రెనీ?" అన్నాను నిర్ఘాంతపోయి.

"వీలులేదు. నువ్వులేకపోతే నేనుండలేను... నువ్వు వెళ్ళకు... రేపు మధ్యాహ్నం ఒంటి గంటకి మాల్ మెయ్‌సాన్ రాజభవనం దగ్గర నువ్వుండాలి. నేను వస్తానక్కడికి... లండన్‌కి వెళ్లననీ, అక్కడకి వస్తాననీ నాకు వాగ్దానం చెయ్యి. వస్తావా?... అదుగో, ఫిలిప్ వచ్చేస్తున్నాడు... వాగ్దానం చెయ్యవూ?"

## కాలం ఒక శూన్యం

**కా**లాన్ని / తామే మారుస్తున్నామనుకుంటారు
కాలం ఆకాశమా?
కాదు భూమి.
భూమి బెడిసి కొడితే
ఆకాశ శూన్యాన్ని ఆశ్రయిస్తారు.
మట్టీ మట్టీ అని అరుస్తారు గాని
మట్టిలోని మాధుర్యం తెలుసా అని?
ఆకాశం అంతర్జాతీయం కదూ
మట్టి అంతటా మట్టే.
సముద్ర ఘోష
మానవ శ్వాస లాంటిది.
పాపం కృష్ణుడు
కాలి గాయంతో చనిపోయాడు.
అలెగ్జాండరూ అంతే
చిన్న జ్వరంతో.
ప్రకృతి ఒక అనివార్య లీల! / ఒక కెరటం
తరువాతి కెరటాన్ని ప్రేమించాలి
అన్నీ గమ్యం చేరుకునేవే
నిన్నటి దూరం / సకల సంవేదనల తీరం
అయినా సరే / మట్టిలోంచే కదా నీళ్లు రావాలి.

—డా॥ ఎన్. గోపి

నేను వాగ్దానం చెయ్యలేదు. నా దగ్గరనుంచి దూరంగా జరిగి కూర్చుంది.

ఫిలిప్ వచ్చి 'ఇదుగో నీ పత్రిక' అన్నాడు.

ఇంత మౌనంగా కూర్చున్న రెనీ మళ్ళీ యథా ప్రకారంగా హాయిగా "ఏమైనా ప్రత్యేకమైన విశేషాలు న్నాయా, ఫిలిప్, ఈరోజు పత్రికలో?" అంది.

"నేనింకా చూడందే" అన్నాడు ఫిలిప్.

కాసేపయాక వెళ్ళిపోవాలని లేచేం. మళ్ళీ నేను ఫిలిప్‌తో రేపు లండన్ వెళ్ళిపోతున్నానని చెప్పేను. నేనెక్కడ నివసిస్తున్నానో కూడా చెప్పేను. ఒక చిన్న పుస్తకంలో వీధివెలుతురు బట్టి నా విలాసం వ్రాసు కున్నాడు. రెండు మూడు నెలలలో నన్ను లండన్‌లో చూస్తానన్నాడు. రెనీతో కూడ వెళ్ళిపోతున్నానని చెప్పేను. పారిస్‌కి వస్తే తనమాట మరచిపోవద్దంది. తనెక్కడుంటోందో నాకు తెలియదంటే, 'తెలియకేం చేస్తుందిలే!' అని సమాధానం చెప్పింది.

ఇకను విడిపోబోతుంటే నన్ను రెనీ "అన్నట్టు పారిస్ అంతా చూసేనంటావు. మాల్ మెయ్‌సాన్ రాజ భవనం ఎప్పుడైనా చూసేవా?" అనడిగింది.

"రెండు మూడుసార్లు చూసేను."

"చూడలేదేమో అని అడిగాను. చాలా అందంగా ఉంటుంది కాదూ?"

"అవును."

ఆ రాత్రంతా ఆలోచించాను; మొన్నాడు ప్రొద్దున్న లండన్‌కి బయలుదేరి వెళ్ళిపోవడమా లేదా అని. మొదట వెళ్ళిపోదామని నిశ్చయించుకొన్నాను. నేను తప్పకుండా ఉండిపోతాననీ, మొన్నాడు ఒంటిగంటకి కలుసుకుంటాననీ రెనీ దృఢంగా నమ్ముతోందని నాకు తెలుసును. తను ఏదడిగితే అది చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నానని రెనీకి ఈ ధైర్యం ఎందుకుండాలని నాకు పౌరుషం కలిగింది. సాయంత్రం ఆఖరిని మళ్ళీ నన్ను మాల్ మెయ్‌సాన్ గురించి ప్రశ్న వెయ్యడం ఒట్టి పెంకితనమూ, గర్వమూకాక మరేమీ కాదని చికాకుపడ్డాను. లండన్‌కి వెళ్ళిపోవాలి నేను. తప్పదు... మళ్ళీ ఒంటిగంటకి మొన్నాడు మాల్‌మెయ్ సాన్ ప్రాంతాలలో నాకోసం ఎంతో ఆపేక్షతో కాచుకుని ఉంటుందని ఆలోచిస్తే జాలివేసింది. ఫిలిప్‌తో తనకేమీ సరియైన ఆనందం లేదు. నిజమే. అంత సున్నితమైన స్వభావం కలదానిని ఫిలిప్ బోధపరచుకోలేడు. అయినా, నేనేమీ చిక్కులలో పడకూడదు. జాగ్రత్తగా కొంతసేపు మాట్లాడి వచ్చేయాలి. పరవాలేదు, ఆ

## చోరబాటు

**షే**ర్ల మార్కెట్లోకే కాదు
కూరగాయల మార్కెట్లోకి చోరబాటు
బడుగుల బ్రతుకులు బజారుపాలు

## ప్రయోజనం

**క**న్నుకొట్టటానిక్కాదు
కరుణ వర్షం కురిపించటానికి
అందరిలో అంతర్యామిని దర్శించటానికి

## చట్టం దృష్టి

**క**డుపు కాలి చౌర్యం ఒకడు
చట్టాల లొసుగులో అండగా
ఉన్నది చాలక కబ్జాలొకడు
వాడు చోరుడైతే వీడు నాయకుడు

## రోడ్డు రిపేరు బోర్డు

**రో**డ్డు అండర్ రిపేరు బోర్డు
సంవత్సరం పొడుగునా
ఏదో ఒక శాఖ త్రవ్వుతుంటుంది గోతులు
ప్రజలకు తప్పని తిప్పలు

-పరుచూరి శ్రీనివాసరావు

మాత్రం నేను చూసుకోగలను- నే నిచ్చిన పుస్తకాలు చూసి చిన్నపిల్లలా ఎంత సంతోషించింది! పాపం, వెళ్ళి చూడకపోతే తప్పు.

మొన్నాడు లండన్‌కి నేను బయలుదేరలేదు. ఒంటిగంట దాటిన కొన్ని నిముషాలలో మాల్ మెయ్ సాన్ ప్రాంతానికి జేరుకున్నాను. ఒక చక్కని గవును తొడుక్కుని రెనీ నాకోసం ఎదురుచూస్తోంది. దగ్గరకు వెళ్లేను. నేను వచ్చినందుకు తన ముఖంలో ఏమీ సంతోషం చూపెట్టలేదు. చూడగానే మాట్లాడనైనా లేదు. దగ్గరలో ఒక హోటల్ ఉంటే 'అక్కడికి వెళ్ళి కూచుందాం రా' అంది. ఇద్దరం అక్కడకు వెళ్ళి కుర్చీలలో కూర్చున్నాం. నేనేమీ మాట్లాడలేదు. రెనీకేసి చూస్తూ కూర్చున్నాను. రెనీ అంతసేపూ నాకేసి చూడకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తోంది. ఆఖరికి తనే మాట్లాడింది.

"ఒంటిగంట దాటేక నువ్విక రావేమోనని బెంగ పెట్టుకున్నాను."

## రేపటి పౌరులు

**రా**జధాని నగర నడిబొడ్డున
ఆకాశహర్మ్యాల పాదాల క్రింద
ఓ మురికివాడలో
పురిటినొప్పులు పడుతోంది ఓ పేదరాలు
భరతమాటకు మరొక బిడ్డను తనవంతుగా
ఇద్దామని
బిడ్డని కనబోతున్నానన్న సంతోషం ఆ తల్లిదైతే
ఆ బిడ్డని రేపు ఏ పనిలో పెడదామా అనే సందిగ్ధం
ఆ తండ్రిది...!
ఆ పితృవాత్సల్యం అతనిది కాదు.
అతనికి వంశపారంపర్యంగా సంక్రమిస్తున్న
దరిద్రానిది
పాపైతే పాచిపనికి... బాబైతే బ్రాందీ కొట్టుకి
కాంట్రాక్ట్ పాడుకున్నాడు ఆ పేద తండ్రి
పాపం...! ఆ తల్లికి తెలియదు
తనకు పుట్టబోయేది ఎవరో...
ఎవరైనా రక్తాన్ని పంచి పెంచుతుంది
ఎంతైనా అమ్మ మనసు కదా...!
మరి
మన భరతమాత ఏమంటుందో...?

**-అనిల్ కుమార్ సోమయాజులు**

"అవును. ఆలస్యం అయింది. కాని నా తప్పు కాదు."

"నువ్వు రాకపోతే నేనివాళ ఏమి చేద్దునో నాకే తెలియదు."

ఇంతట్లో హోటల్‌వాడు వచ్చి ఏమి కావాలని అడిగేడు. తినేందుకేవో కొన్ని పదార్థాలు తయారు చేయమన్నాం. వాడు వెళ్ళిపోయాడు.

ఇంకా రెనీ నాకేసి చూసేందుకు సిగ్గుపడుతోంది. నేనప్పుడు, "రెనీ, నువ్వు నన్నీవాళ ఎందుకు రమ్మన్నావో తెలియదుకాని, నేను రాకుండా ఉండేందుకు చాలా ప్రయత్నం చేసేను. నాకిదేమీ బోధపడడంలేదు" అన్నాను.

"నువ్వలా ప్రయత్నం చేస్తావని నాకు తెలుసును. నిన్న రాత్రంతా నాకు నిద్రలేదు. నువ్వు రావేమోననే నా బెంగ, నువ్వు..." ఇక మాట్లాడలేకపోయింది. బల్లమీద తలవాల్చి ఏడవడం మొదలెట్టింది.

"ఏడవకు రెనీ. ఎందుకిలా ఏడుస్తావు? నేనన్న మాటలేమైనా నీ మనస్సు నొప్పిస్తే నన్ను క్షమించు."

"నీ మాటలకని కాదు."

"మరేమిటి?"

"నీకు... నేనంటే... లెక్క లేదు."

"మరొకరయితే నేనివాళ లండన్‌కి వెళ్ళకుండా ఉండిపోదునా?"

"నేనంత పోరు పెట్టేను కనుక ఉండిపోయావు"

"నిజమే. మరొకరు పోరుపెట్టినా ఉండక పోదును."

కళ్ళు తుడుచుకుంది. తన చెయ్యి నా చేతిమీద వేసి ఎంతో మృదువుగా నా వేళ్ళని తడిమింది.

"నన్నింకా బోధపరచుకోలేక పోతున్నావు" అంది.

"నిన్ను బోధపరచుకోలేక కాదు. నాకిదంతా నచ్చడంలేదు... నిన్నూ నన్నూ ఇప్పుడు ఫిలిప్ చూస్తే ఏమనుకుంటాడు?"

"ఫిలిప్ ఏమనుకున్నా నాకింక పరవాలేదు"

"అలా అనకు. ఫిలిప్‌కి నువ్వంటే ఎంతో ప్రేమ."

"నీకు లేదూ."

"నాకు లేదని కాదు. నా ప్రేమ మరొకరకం. నువ్వంటే నాకు ఎంతో అమితమైన స్నేహభావం. ఈసారి వచ్చి నిన్నంటూ ఒకత్తెని కలుసుకున్నందుకు నా కెంత సంతోషంగా ఉందో నువ్వు ఊహించలేవు. కాని... అంతే. ఫిలిప్ ప్రేమ అలాంటి కాదు."

"నాతో ఫిలిప్ గురించి మాట్లాడేందుకా ఇక్కడికి వస్త నువ్వు?"

"అందుకే"

"అయితే మళ్ళీ వెళ్ళిపో, ఫిలిప్ సుగుణాలన్నీ నువ్వు నాకు వర్ణించనక్కరలేదు. నీకంటే ఫిలిప్‌ని నేనే బాగా ఎరుగుదును."

"నువ్వెరగవని కాదు... అయినా, రెనీ, నీ ఉద్దేశం ఏమిటి? ఎందుకింత బాధపడిపోతున్నావు నువ్వు?"

"నేనేమీ బాధపడడం లేదు."

"ఈ ఏడుపూ ఇదంతా ఏమిటి?"

"నిన్ను మళ్ళీ చూడకుండా ఉండమంటే ఉండలేను... నువ్వేమిటి చెయ్యమంటే అది చేస్తాను. ఏమిటి చెయ్యమంటే అది... కాని, నిన్ను మట్టుకు నేనెప్పుడూ చూస్తూ వుండాలి."

"నా మాతృదేశం ఇక్కడెక్కడా లేదని నీకు తెలుసునా?"

"నేనదంతా ఇప్పుడు ఆలోచించదలుచుకోలేదు."

"పోనీ, నా శరీరచ్ఛాయ చూడు. నల్లని నలుపు...

నీకూ నాకూ స్నేహం ఉండొచ్చును, కాని మరే సంబంధానికి వీలులేదు."

"నన్ను పెళ్ళిచేసుకోమని బ్రతిమాలుకోడం లేదు నేను."

"రెనీ, ఫిలిప్ నిన్ను నిజంగా సుఖపెట్టగలడు. మరేవిధంగానూ నీకు సుఖంలేదు. నువ్వు మోసంచేస్తే ఫిలిప్ భరించలేడు."

"ఫిలిప్ కోసమే అంత బెంగా నీకు?... నేను కాకపోతే నా వంటివారు లక్షమందున్నారు ఫిలిప్‌కి."

"ఫిలిప్ కోసం అని కాదు బెంగ. నీ కోసమే."

ఇంతట్లో హోటల్ వాడు తినేందుకూ, తాగేందుకూ అన్నీ బల్లమీద తెచ్చి పెట్టేడు.

తింటుంటే మధ్యలో రెనీ నన్నొక విచిత్రమైన ప్రశ్న వేసింది. "నిజం చెప్పు. నీకు సరిపడినంత అందంగానూ లేనా?" నాకు నవ్వొచ్చింది.

"నీ అందానికి లోటులేదు. నీ తెలివితేటలకి అంతకంటే లోటులేదు. ఎవరిలోనైనా అందం కంటె తెలివితేటలు నన్నెప్పుడూ ఎక్కువ ఆకర్షిస్తాయి" అన్నాను.

తినడం అయాక ఎక్కడకి వెళ్ళడం అన్న చర్చ వచ్చింది. "మాల్ మెయ్‌సాన్ భవనం వెళ్ళి చూద్దాం" అన్నాను. "దరిద్రంగా ఉంటుంది. మరెక్కడికైనా వెళ్దాం" అంది రెనీ. మిగిలినచోట్ల గురించి ఆలోచించడంలో ఒకరికి నచ్చినది మరొకరికి నచ్చలేదు. ఆఖరికి నేను "లూవ్రె చిత్రశాలకి వెళ్దాం" అన్నాను.

"లూవ్రేకా?... ఫిలిప్ కనబడతాడేమో?"

"అయితే వద్దు."

"పరవాలేదు. లూవ్రేకే వెళ్దాం పద."

తోవలోనూ, లూవ్రేలోనూ మళ్ళీ రెనీ నాతో అన్ని సంగతులూ అతి సరదాగా మాట్లాడింది. మిగిలిన మాటలు మాట్లాడుతూ మధ్య మధ్య నన్నింకా పారిస్‌లో ఒకవారం అయినా ఉండిపొమ్మని బతిమాలుకునేది. ఆలోచిస్తానని జవాబిస్తూ వచ్చాను. ఒకచోట అమూర్ అండ్ సైకీ (అనగా పాశ్చాత్య రతీమన్మథులు) చిత్రం చూపించి, అదెంత బాగుందో చూడు అంది. అది చూస్తుంటే చటుక్కున నా చెయ్యి పట్టుకొని పారిస్‌లో ఇంకా కొన్ని రోజులుండిపోతానని వాగ్దానం చెయ్యమంది. చుట్టూ ఎటుప్రక్క చూసినా మనుష్యులు. ఎవరూ కనుచూపుమేరలో లేనట్టు నాకేసి అతిప్రేమోద్రేకంగా చూస్తోంది రెనీ. నాకు సిగ్గేసింది. చెయ్యి విడిపించుకుని, "మరొక మూడు రోజులు తప్పకుండా పారిస్‌లో ఉంటాను. ఆ పైని నేను మాటివ్వలేను" అన్నాను. "సరే" అంది. మరొకచోట "మూడు రోజులూ ఉంటానన్నావు సుమా. మాట నిలబెట్టుకోవాలి, మర్యాదస్తుడిలా" అంది.

"వాగ్దానం చేసి నిలబెట్టుకోకేం చేస్తాను?"

ఆవేళ నాలుగు గంటలకి తను వెళ్ళిపోవాలంది. "ఫిలిప్‌ని చూడడానికా?" అంటే అవునంది. మళ్ళీ కాసేపుండి, "నువ్వీవాళ ఫిలిప్‌ని వెళ్ళి చూడొద్దంటే మానేస్తాను సుమా" అంది.

"తప్పకుండా వెళ్ళి చూడు."

"ఎప్పుడో ఒకప్పుడు త్వరలోనే మేమిద్దరం విడిపోక మానం. కాని సంగతంతా ఫిలిప్‌కి కొంచెం కొంచెంగా బోధపరచాలని నా ఉద్దేశ్యం. ఒక్కసారిగా చెప్పడం నాకిష్టం లేదు... నువ్వు వెళ్ళమంటేనే నేను వెళ్తాను. ఏమంటావు?... నన్నికను ముట్టుకోనివ్వను ఫిలిప్‌ని."

ఆ మాటలు వింటుంటే నేనేం చేస్తున్నానో నాకే బోధపడలేదు. లోలోపలి నుంచి కంగారు పుట్టుకొచ్చింది. పైకి తాపీగా ఉన్నట్టు నటించాను.

ఇంతట్లో హెన్నర్ యొక్క 'చదువరి' అన్న చిత్రపటం దగ్గరికి వచ్చాం. రెనీ నా వీపు తట్టింది.

"అదుగో, చూడు"

"రెనీ, నువ్వూ నేనూ తప్ప దీని నెవరూ పొగడ

## ఎవరి కోసం?

ఎన్నో వేశ్యల కళ్ళు వేచి చూస్తున్నాయి
విటుని కోసం
ఎందరివో అనాథల చేతులు చాచి వున్నాయి
ఆదరణ కోసం
ఎన్నో బ్రతుకులు బీడులై వున్నాయి
ప్రేమ జల్లు కోసం
వాడిన జీవాలెన్నో వేదన పడుతున్నాయి
చల్లని స్పర్శ కోసం
నిరుద్యోగులెందరో ఎదురు చూస్తున్నారు
చిన్న పనికోసం
మేధావులెందరో మదనపడుతున్నారు
దేశం కోసం
మరి తప్పిన తీవ్రవాదం ఎందర్నో వధిస్తోంది
ఎందుకోసం?

-మల్లెమొగ్గల గోపాలరావు

లేదంటావా?"

"లేదు. నిజానికి ఇది మనిద్దరిదే"

"అయితే పట్టుకుపోదామా?"

ఇక్కడ చూసేందు కెవరూ లేకపోతే అంత పనికీ నేను సంసిద్ధురాలినే... ఏ రాత్రైనా మనిద్దరం వచ్చి దొంగిలిద్దాం."

"రెనీ, ఇకమీదట నువ్వు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఈ చిత్రపటం కూడా జ్ఞాపకం వస్తుంది నాకు."

"ఎందువల్ల?"

"రెండు రోజుల క్రిందట నువ్వూ నేనూ కూడా అన్నాం జ్ఞాపకంలేదూ? ఈ 'చదువరి'ని చూస్తే మనో వికారాలేవీ పుట్టవు. చిత్రకారుడు చిత్రించిన శరీరంలో కంటె, చిత్రకారుడిలో ఉన్న కవి ఉద్దేశించిన మనస్సౌం దర్యంలో ఎక్కువ శోభ కనిపిస్తోంది."

"అదంతా బాగానే ఉందిలే. కాని నేను జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఇదెందుకు జ్ఞాపకం రావాలి నీకు?"

"ఏమో, చెప్పలేను... నిన్ను చూస్తేకూడా నాకు స్వచ్ఛమైన ఆనందమే కాని, మనోవికారం లేదు కనుకనేమో."

"నిజంగా? నేను నీకంత అందవికారంగా కనిపిస్తున్నానా? నీకు మనోవికారం కలుగలేదంటే అది నాలో అందవికారం అన్నమాటే."

"నువ్వా అందవికారివి?"

"నా చిన్నప్పుడు అందరూ నేను చాలా అందంగా ఉండేదాన ననేవారు."

"ఇప్పుడు నువ్వందంగా లేవనా. నువ్విప్పుడు చిన్నదానవు కావనా?... అందానికేంగాని నాలుగు గంటలయిపోతోంది."

"అప్పుడే? అవును. నేను వెళ్తాను. మళ్లీ రేపు... పన్నెండు గంటలకే ఈవాళ కలుసుకున్న చోటనే కలుసుకుందాం. ఏమి?"

"సరే"

"నన్ను మోసపుచ్చకు సుమా... పన్నెండు గంటలకి... నిజంగా నువ్వు నన్ను ప్రేమించకపోతే నా జీవితం అర్థంలేనిదైపోతుంది... అలా నవ్వకు, వేళాకోళం కాదు."

"రెనీ, ఇప్పుడు వెళ్లేముందు నీ విలాసం నాకు తెలియజెయ్యి. నాది తెలుసును కాదూ?"

"ఇప్పుడు తొందరేమిటి? రేపు చెప్తాను... నాకు చెప్పకుండా వెళ్లిపోదాం అనుకుంటున్నావా? వద్దు సుమా... మర్యాదైన పనేనా అది?"

"ఈ అపనమ్మకాలన్నీ ఏమిటి, రెనీ? నీకు మాటిచ్చాక వెనుక తియ్యను."

"సరే. రేపు పన్నెండు గంటలకి... వెళ్లనా?"

రెనీ వెళ్ళిపోయింది. నేను ప్యారిస్ వీధులంట మతిపోయినవాడిలా తిరిగి తిరిగి ఎనిమిది గంటలకి హోటల్‌కి చేరుకున్నాను. ఏమీ భోజనం చెయ్యలేదు. నా గదికిపోయి బట్టలు మార్చుకోకుండానే దీపం ఆర్పేసి పక్కలో పడుకుని ఈ రెండు మూడు రోజుల లోనూ జరిగిన చర్యలన్నిటి గురించి దీర్ఘంగా ఆలోచిం చాను. ఆలోచించిన కొలదీ నా ప్రవర్తనా, రెనీ ప్రవర్తనా కూడా చాలా అసందర్భం అనిపించాయి. నేను రోజురోజుకీ ఎక్కువ తెలివితక్కువగా సంచరిస్తున్నానని తోచింది. రెండు రోజుల క్రిందటే నేను లండన్‌కి వెళ్ళిపోవలసిందనుకున్నాను. రెనీ నన్ను చాలా ప్రేమిస్తోందనేమాట నిశ్చయం. కాని రెనీ నాకెంత నచ్చినా, తనంటే నాకు, తన కున్నటువంటి ప్రేమ లేదన్న మాట కూడా నిశ్చయం. తను ప్రేమించినట్లు నేనెలా ప్రేమించగలను? ఇంకా నాలుగు రోజులు కూడా కాలేదు ఫిలిప్ తనూ కలిసి, నాలుగైదు గంటలు ఈ గదిలోనే ఒంటరిగా గడిపి. మళ్ళీ అలా వాళ్ళిద్దరూ గడిపేరని నా మనస్సులో ఎంత వెతికినా ఏమీ ప్రణయాసూయ కూడ లేదు... ఏదో ఒకవిధంగా ఫిలిప్‌తో సంతృప్తిపొంది రెనీ సుఖంగా ఉండాలనే నా ఉద్దేశం. సుఖంగా మట్టుకుండాలి, పాపం.

చెప్పకుండ మొన్నాడు ప్రొద్దున్న వెళ్లిపోదాం అని నిశ్చయించుకున్నాను. దీపం వెలిగించి గడియారం చూస్తే పదకొండు గంటలయింది. మూడు గంటలలా చీకట్లో కొట్టుకున్నానన్నమాట, ఈవిధంగా మనస్సు దృఢపరచుకునేందుకు. తెల్లవారగానే బయలుదేరాలి కనుక బట్టలూ అవీ సర్దుకోవలసినవి కొన్ని సర్దడం మొదలెట్టేను. ఇంతట్లో ఎవరో నా గది తలుపు కొట్టేరు. భోజనం ఎందుకు చెయ్యలేదని అడిగేందుకు హోటల్ యజమాని వచ్చినట్టుందనుకుని లోపలికి రావచ్చునని గట్టిగా చెప్పేను. వెనక్కి తిరిగి చూసేసరికి తలుపు తెరచి లోపలికి వచ్చినది- రెనీ!

"ఇదేమిటి, రెనీ?"

"రేపు వెళ్లిపోవాలని పెట్టె సర్దేస్తున్నావా?"

"సర్దడంకాదు, అన్నీ పైనుండిపోతే పెట్టెలో పెట్టు న్నాను. కాని నువ్వెందుకు వచ్చినట్టిప్పుడు?"

"నిజం చెప్పు. రేపు వెళ్ళిపోదాం అనుకుంటున్నావా లేదా?"

"వెళ్ళడానికి కాదు, రెనీ... నీకు వెళ్ళనని మాటిచ్చాక వెళ్ళిపోతానా?... సరేలే, అర్ధరాత్రి నా గదికి రావాలని నీకెందుకు బుద్ధిపుట్టింది?... ఏమిటీ దారుణం?"

"నిజం చెప్పనా? నువ్వేమీ అనుకోకు. సాయంత్రం నీ మాటలు కొన్ని జ్ఞాపకం తెచ్చుకుంటే నువ్వు నాకు తెలియపరచకుండా వెళ్ళిపోవాలనుకున్నావని అనుమానం కలిగింది. మళ్ళీ వెళ్ళొద్దని బ్రతిమాలుకునేందుకు వచ్చాను."

"రెనీ, నీకు మతిపోయిందా?"

"అవును, మతిపోయింది."

"ఇలా అర్ధరాత్రి నా గదికి వస్తే హోటల్ యజమాని ఏమనుకుంటాడు?"

"ఏమనుకుంటే నాకేమిటి లెక్క?"

"ఇంతవరకూ నేను చాలా మర్యాదస్తుడననుకుంటున్నాడు."

"తను అనుకుంటున్నంత కంటె కూడా చాలా మర్యాదస్తుడవని నేను బోధపరుస్తానులే. ఇలా నేను నుంచోవలసినదేనా? నీ పక్కమీద కూర్చుంటాను."

"వద్దు రెనీ, మనిద్దరం కూడా ఇప్పుడే పైకి వెళ్దాం. నిన్ను మీ ఇంటిదాకా దిగబెట్టి నేను మళ్ళీ వస్తాను.

"నన్ను వదలగొట్టుకుందాం అని చూస్తున్నావు. నువ్వు ఉండిపొమ్మంటే ఈ రాత్రంతా నీతోనే ఉండిపోదాం అనుకుని వచ్చాను. తెలుసునా"

"ఆ మాట ఎలా అనగలిగేవు, రెనీ? ఈ గదిలోనే ఫిలిప్‌తో నాలుగు గంటలు స్వేచ్ఛగా నువ్వు కాలం గడిపి నాలుగు రోజులు కూడా కాలేదు."

"ఆ సంగతి నువ్విప్పుడు జ్ఞాపకం చెయ్యడమంత క్రూరత్వం మరొకటి లేదు."

"అబద్ధం చెప్తున్నానా నేను?"

"ఫిలిప్ అంటే నాకింకా ప్రేమ మిగిలిందనుకుంటున్నావా?... ఫిలిప్‌ని నేనెన్నడూ అంతగా ప్రేమించలేదసలు... ఈవాళ తనతో గడిపిన ప్రతి నిముషం ఒక యుగంలా అనిపించింది. తనతో కూర్చున్నంతసేపూ నీ గురించి ఆలోచిస్తూ ఉన్నాను."

"వెళ్దాం. రా, రెనీ"

"ఎక్కడికి?"

"మీ ఇంటిదాకా వస్తాను."

"అక్కడికి నువ్వు వచ్చేందుకు వీలులేదు. ఏదైనా వనంలోకి వెళ్ళి కూర్చుందాం."

"వద్దు రెనీ. ఆలస్యం అయిపోయింది... అన్నట్టు

## ఏమయ్యింది?

"నీరే గరళమయ్యింది
దప్పిక తీర్చే జలమే మరణాన్ని కోరింది
గాలిలో విషమేదో నిండింది
నీటికి అందరూ సమానమే, అయినా
బీదోళ్ళకే శాపనార్థాలు పెట్టింది
పూజించిన దేవుడు
పూట గడిపించిండా
కక్కి చచ్చిన కొడుకు
ఎంత ఏడ్వను, కన్నీరే లేదు
కంట్లో, గుడ్లు తప్ప
వాడ వాడంతా, ఊరు ఊరంతా
రోధనల డప్పులు
నవ మాసాలు మోసి, కని
పెంచిన కొడుకు
కళ్ళముందే, కళ్ళు తేలేస్తే
తల్లి ఆక్రందనల అరుపులు
పల్లె పొలిమేరల్లో వినిపించినా
పారే జలపాతాలు ఆగిపోలేదు
బతుకిచ్చిన భగవంతుని మనసు కరగలేదు
భూమి బద్దలవ్వలేదు, కన్నతల్లి గుండె తప్ప
అవినీతి పల్లెను కప్పిందో
బాధ్యత భావిని మరచిందో
ఊరైతే వల్లకాడయ్యింది

## ఎండిన దేహాలు

రహదారి విస్తరణలో
చెక్కబడిన ఇండ్లు
బతుకు పోరాట వేదనలో
రోడ్డెక్కిన వాకిళ్ళు
ప్రాణి మనుగడనే
ప్రశ్నించే సవాళ్ళు
తుపాను గాలిలో
చెదిరిన పక్షుల గూళ్ళు
తడి ఆరని ఆశల లోగిళ్ళు
వాగ్దానాల వానలో
తడిసి తడిసి ఎండిన దేహాలు

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్

నీ విలాసం చెప్పేవు కాదు... రేపు మళ్ళీ అడగడం మరచిపోతానేమోనని."

"నువ్వా మరచిపోవడం? నా విలాసం చెప్పమని నువ్వడిగినప్పుడల్లా నువ్వు నాకు కనబడకుండా వెళ్లిపోతావేమోనని భయం."

"అందుకు కాదు. ఇప్పుడు చెప్తే పుస్తకంలో వ్రాసుకుంటాను."

"నేను రేపో ఎల్లుండో ఏదైనా పుస్తకంలో వ్రాసి ఇస్తానులే."

"నీ ఇష్టం. ఇక వెళ్దాం రా."

ఇద్దరం హోటల్ వదలి పైన పడ్డాం. కొంతదూరం వెళ్లేక రెనీ మళ్లీ 'ఎక్కడికైనా వెళ్ళి కూర్చుందాం' అంది. ఇప్పుడు కాదని తప్పించుకున్నాను. అయితే తను ఇంటికి వెళ్ళిపోతానంది. స్టేషన్‌దాకా నేను వస్తానంటే రావద్దంది. వెళ్ళిపోతూ కూడా "ఇంకా నన్ను నువ్వు మోసపుచ్చి నాకు తెలియపరచకుండా వెళ్లిపోతావని నా బెంగ" అంది.

హోటల్‌కి వచ్చాక హోటల్ యజమానితో మొన్నాడు ప్రొద్దున్నే లండన్‌కి వెళ్లిపోతున్నానని చెప్పేసేను. ఇవ్వవలసిన డబ్బంతా ఇచ్చేసేను. రెనీ ఆ రాత్రి రావడం గురించి కొంచెం సరదాగానూ, వేళాకోళంగానూ అతను మాట్లాడబోయాడు. నేనేమీ సమాధానం చెప్పకపోయేసరికి మళ్లీ ఊరుకున్నాడు. కాసేపయాక మాటలలో తన భార్యా పిల్లలూ నిద్రపోతున్నారని చెప్పేడు. వాళ్ళు లేవకుండానే వెళ్లిపోతాను కనుక వాళ్లందరికి నా క్షమార్పణలంద చేయమన్నాను.

మొన్నాడు బయలుదేరి లండన్ జేరుకున్నాను. పారిస్ నుంచి లండన్ వరకూ ఒక్కటే ఆలోచన నాకు. రెనీ. పారిస్‌లో రైలెక్కేటప్పుడు రెనీ ఆఖరి నిముషాన్ని మోసం కనిపెట్టి స్టేషన్‌కి వచ్చేస్తుందేమో అన్న కంగారు తప్ప మరే ఆలోచనా లేదు. కాని లండన్ జేరుకుంటుంటే, రైలు విక్టోరియా స్టేషన్‌లోకి ప్రవేశించబోతుంటే రెనీ గురించి ఆలోచిస్తూ దుఃఖం ఆపుకోలేక ఏడ్చేసేను.

ఆ తర్వాత లండన్‌లో కూడా నేనాట్టే రోజులుండలేదు. అకస్మాత్తుగా నేను లండన్ వదలి ఇంటికి వచ్చెయ్యవలసొచ్చింది. రెనీ గురించి ఇప్పటివరకూ మళ్ళీ ఏ మాటా వినలేదు నేను...

ఇది ఇండియా దేశం. ఇక్కడ స్త్రీ ప్రపంచంలో ఎటుప్రక్క చూసినా సిగ్గుదొంతరలే, మేలిముసుగులే, ఘోషాలే. ఇప్పుడు నా లోకం ఇదీ. రెనీ లోకం ఇది కాదు. అప్పుడప్పుడు సంధ్యా సమయాలలో కళ్లు మూసుకుని రెనీ గురించి ఆలోచిస్తే, రెనీ ముఖం– ఆ ముఖంలో నేనెన్నడూ చూడనటువంటి దైన్యం, రౌద్రంతో చెదరిపోయి కనిపిస్తుంది. నన్నిప్పటికింకా రెనీ క్షమించి ఉండదని విచారిస్తూ ఉంటాను. కాని ఎప్పుడైనా మిట్టమధ్యాహ్నం రెనీ గురించి ఆలోచిస్తే ఫిలిప్‌ని తను పెళ్లిచేసుకునే ఉంటుందనీ, అయిదారుగురు పిల్లలకి తల్లయి నామాటే మరచిపోయి ఉంటుందనీ నాకు తోస్తుంది... జీవించే ప్రతి జీవికీ రెండు పరస్పర వ్యతిరేకమైన మనోగుణాలుంటాయి. ఒక మనోగుణానికి జీవిత పరిస్థితులతో మైత్రి; రెండవ గుణానికి జీవిత పరిస్థితులతో వైరం. రెండూ ముఖ్యమైనవే! ■

## తిరోగమనం..

ఒక్క నిముషమైనా స్థిరత్వమేది మనసుకి?
చంచలమై చపలచిత్తమై అనుక్షణం
వణుకుతోంది అంతరంగం...
కాలపరీక్షకు నిలబడాలంటే భయం
ఉన్నదున్నట్టు జీవితాన్ని ఎదుర్కోవాలంటే భయం
తీయని రుచికి అలవాటయిన నోరు
మేలు చేసే చేదు వద్దంటోంది
సుఖాలకు లొంగిపోయిన శరీరం ఆత్మని
మోసగించింది
ఇక పోరాటాలుండవు.. పరాధీనతలే!
ఇక అస్త్రసన్యాసాలే.. ఆత్మాభిమానాలుండవు
ఇక ఘర్షణల్లేవు.. సత్యాల్లేవు.. జీవన ఔన్నత్యాల్లేవు
తెలిసిందల్లా జీవితాన్ని జుర్రుకోవడమే!
ఈ క్షణం బతికెయ్యడమే!
సుఖాలాలసత ఇంతగా నీలోని విచక్షణని
చంపేసిందా?
రక్తసంబంధం, స్నేహం, చట్టం, సమాజం, మంచి,
మానవత్వం
దేనికీ నీవు వెరవడం లేదు...
కోరలు సాచే కోరికల మంటని వెలుతురుగా
భ్రమపడి
పరిగెత్తే ఓ మనిషీ! కాలిపోవడం నీకు కొత్తేమో
కానీ
అగ్నికి కాదు...

–షేక్ రఫీ